

# డాక్టర్‌గారి భార్య

## – కొమ్మూరి వేణుగోపాలరావు



(గత సంచిక తరువాయి)

**ఎక్కువగా రొటీన్** కేసులు, థ్రిల్ లేకపోవటం, ఒక్కోసారి అతను నిరుత్సాహపడిపోయేవాడు. కాని సహజ ఆ నిరుత్సాహానికి దూరంగా ఉంచటానికి ప్రయత్నించేది.

"ఒక పేషెంటు – గుమ్మంలోకి అడుగుపెట్టటానికి ఎన్ని ఆలోచిస్తాడో తెలుసా?"

అతను ప్రశ్నార్ధకంగా చూశాడు.

"ఆ డాక్టరు వయసు, అనుభవం, హస్తవాసి గురించి ఇతరులు చెప్పిన మాటలు, తీసుకునే డబ్బు, అన్నిటికీ మించి తన జబ్బు గురించి ఆ డాక్టరుకు అర్థం చేసుకునే శక్తి వుందా లేదా అని ఆలోచిస్తాడు. ప్రతి పేషెంటూ తన శరీరమూ, వ్యాధి, బాధా అతీతమనుకుంటాడు. తన ఒక్కడిదే జబ్బు అనుకుంటాడు..."

"చెప్పిందే చెబుతాడేం?"

"అది యూనివర్సల్‌గా ప్రతి పేషెంటుకూ వుండే లక్షణం. ఎన్నిసార్లు చెబితే అంత బాగా వింటాడనీ, ఎంత విపులంగా చెబితే డాక్టరుకు జబ్బు బాగా అర్ధమవుతుందనీ అనుకుంటాడు. చెప్పిందే చెబుతాడు. అడిగిందే అడుగుతాడు. డోసులు, టైమింగ్స్ అన్నీ చాదస్తంగా అడుగుతాడు."

"అవన్నీ అనవసరం, అధిక ప్రసంగాలైనా వింటూ వుండాలా?"

"ఎంతవరకూ వినాలో అంతవరకే విని, మిగతాది వింటూన్నట్లు నటించండి. ముఖంలో విసుగూ, కోపం ప్రదర్శించవద్దు – చిరునవ్వు చెరగనివ్వవద్దు. అయితే ఆ వినకపోవడంలో ముఖ్యమైన విషయాలు మిస్ అవకూడదు. మనం వినకపోవటం వల్ల పేషెంటుకు హాని కలక్కూడదు."

"అలా అని అతను టైం వేస్ట్ చేస్తూ వుంటే?"

"ఉపాయంగా, లౌక్యంగా కట్ చెయ్యాలి – అతనికి కష్టం కలిగించకుండా"

టైమింగ్స్ విషయంలో సహజ చాలా నిక్కచ్చిగా వుండేది. అయిదూ అయిదున్నర తర్వాత అతన్ని నిద్రపోనిచ్చేదికాదు. అతనికి నాలుగు ఆరు గంటల మధ్య నిద్ర అంటే చాలా ఇష్టం. గాఢంగా నిద్రపట్టి భళ్ళున తెల్లారిపోయినట్లుండేది.

కాని...

ఓ గంటముందుగా నిద్రలేస్తే రోజులో ఎంత కలసి వస్తుందో, ఎంత ఎక్కువగా పని చెయ్యవచ్చో – అతనికి అనుభవపూర్వకంగా తెలిసింది. జీవితంలో నిద్రాప్రియులూ, భోజన ప్రియులూ, అర్థంలేని వ్యాపకాలకు కాలం వృధా చేసేవాళ్ళు ఎప్పటికీ పూర్తిగా పైకిరారు. కొన్ని కొన్ని కోణాలలో విజయం వరించినా, ఆ విజయంలో సంపూర్ణత్వం వుండదు.

అతనికి బ్రేక్‌ఫాస్ట్ త్వరత్వరగా ముగింపచేసి, ఎనిమిది గంటలకల్లా క్లినిక్‌లోకి పంపేది.

"ఈ టైములో వొస్తే డాక్టరు అందుబాటులో వుంటాడు అన్న నమ్మకం పేషెంటుకు కలగాలి వస్తారు మెల్లగా. వస్తే వస్తారు లేకపోతే లేదు అన్న యింప్రెషన్ పేషెంటుకి కలక్కూడదు."

"అతనాలశ్యంగా వస్తే?"

"యమర్జన్సీలో టైము, ఆలశ్యం అనే వాదానికి ఆస్కారం లేదు. అలా కానప్పుడు కూడా సినిమాలు చూసి వొచ్చీ, పేరంటాలకు వెళ్ళొచ్చీ, భోజనాలు ముగించుకుని, అనవసరంగా అశ్రద్ధతో రోగాన్ని ముదరపెట్టుకునీ వస్తుంటారు. తప్పు వాళ్ళదే అయినా మనమే సరిపెట్టుకోవడం మంచిది. మనం పుట్టి పెరిగిన వాతావరణానికీ, మన మనస్తత్వాలకూ, తత్వాలకూ ఎపాయింట్ మెంట్ సిస్టం కుదరదు – బాధకలిగినా డాక్టరే భరిస్తే మంచిది."

"మరి నాకు ఆకలివేస్తేనో?" అన్నాడు నరేష్ చిలిపిగా.

"నేనున్నానుగా తీర్చటానికి?"

"ఏ ఆకలి?"

"ఏ ఆకలయినా సరే"

"అయితే తీర్చు"

"ఇప్పుడా?"

"ఆఁ ఇప్పుడే."

ఒకరోజు మూడేళ్ళ పాపను తీసుకొచ్చారు. వాంతులవుతున్నాయి. జ్వరం, వల్లనేమోనని చూస్తే జ్వరంలేదు. ఎప్పుడు ఎవర్ని వాంతులతో తీసుకొచ్చినా అతను ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాడు. గాస్ట్రో ఎంటరైటిస్ అయితే డయారియా కూడా వుంటుంది. కొన్ని రోజులుగా జ్వరం వున్న హిస్టరీ వుంటే మెనింజైటిస్ దృష్టిలో ఉంచుకోవాలి. ఒట్టి వాంతులే అని నిర్లక్ష్యం చేస్తే కొంప మునుగుతుంది. ఎన్‌సెఫలైటిస్ అయితే నిమిషాల మీద ముంచుకొస్తుంది. అవేమీ కావని నిర్ణయించుకుని సిక్విల్ ఇంజక్షన్ చేశాడు. పాప మత్తుగా నిద్రపోయింది.

తెలివి వచ్చాక వాంతులయితే లేవుగాని ఉన్నట్టుండి కనుగుడ్లు పైకి తిరిగాయి. మూతి ప్రక్కకి పోయింది. మెడ వెనక్కి పోయింది. వెన్ను బాణంలా వంగింది. ఉన్నట్టుండి పాప తలిదండ్రులు గొల్లుమన్నారు. నరేష్‌కు కూడా మొదట అర్థం కాలేదు. ఏం జరిగింది? అతని చేతుల్లోకి ఒణుకొస్తోంది పిల్ల తలిదండ్రులు ఊపిరాడనివ్వడంలేదు. తల్లయితే 'మా అమ్మాయిని బ్రతికించడి తండ్రోయ్' అని శోకాలు పెడుతోంది.

నరేష్ స్తబ్ధుగా చూస్తూ నిలబడ్డాడు. ఏం జరిగి వుంటుంది? పాప తెలివిగా వుంది – కోమాలో లేదు. మెనింజైటిస్ అవటానికి అవకాశంలేదు. అతనికి ఒళ్ళంతా చెమటలు పట్టింది. కొంచెం తెలివి తెచ్చుకుని పల్స్ చూశాడు. బాగానే వుంది. ఒక్క క్షణం కేసు నెమరువేసుకున్నాడు. తను ఏమి ఇంజక్షన్ చేశాడు? సిక్విల్ – అంటే ట్రైపు ప్రోమజిన్ హైడ్రో క్లోరైడ్. ఎక్స్ట్రాపిరమిడల్ లీషన్ రావడానికి అవకాశముంది. ఆ ఆలోచన రాగానే అతని బుర్ర గబగబా పనిచేసింది. ఫినర్గాన్ వన్ సి.సి వెంటనే ఇంజక్షన్ ఇచ్చేశాడు. డిసిపాల్ టాబ్లెట్ పొడిచేసి, బి కాంప్లెక్స్ సిరప్‌లో కలిపి పాపను నోరు తెరవమన్నాడు. ఆ స్థితిలో నరాలు ఎలా స్వాధీనమయ్యాయోగాని నోరు కొద్దిగా తెరిచింది. స్పూన్‌తో మందు పోశాడు. మింగింది. ఫినర్గాన్ వల్ల కొద్దిగా నిద్రపడుతోంది. ఒక పావుగంట తర్వాత అవలక్షణాలన్నీ క్రమంగా సర్దుకుని పాప మళ్ళీ నిద్రపోయింది.

అప్పట్నుంచీ సిక్విల్, క్లోరోక్విన్, డయిజిపాం యిలాంటి యింజక్షన్లు ఇవ్వవలసి వచ్చినప్పుడు ఏంటిడోస్ ముందుగా యిచ్చి తర్వాత ఇంజక్షన్ చేసేవాడు.

డాక్టర్ల జీవితంలో ఎంత టెన్షన్. ఒక రకంగా చూస్తే నెత్తురుకూడులాంటిది. పేషెంటుకు సీరియస్‌గా వుంటే అందరికన్నా పదిరెట్లు టెన్షన్ అనుభవిస్తూ వుంటాడు. డాక్టర్ సెన్సిటివ్ అయితే మరీనూ. రాత్రుళ్ళు నిద్రపట్టదు. అన్నం సహించదు. ఒక్కోసారసలు ఆకలి వుండదు. టైము తెలియదు.

ఒకసారి ఓ యిరవయ్యేళ్ళ అమ్మాయికి పెనిడ్యూర్ యిస్తున్నాడు. ఆ అమ్మాయికి రొమాటిక్ పెయిన్స్. యాంటీ రొమాటిక్ టాబ్లెట్స్‌తోపాటు పదిహేను రోజులకోసారి పెనిడ్యూర్ ఎల్.ఎ. ట్వెల్వ్ యిస్తున్నాడు. అప్పటికి నాలుగయిదు యింజక్షన్లు అయినాయి. ఎలాంటి రియాక్షన్ రాలేదు. ఈసారి ఇంజక్షన్ చేసి టేబుల్ దగ్గరనుండి యివతలకు వచ్చాడో లేదో ఆ అమ్మాయి హీనస్వరంతో "డాక్టర్" అని పిలవటం వినిపించింది. ఆ పిలుపులో ఏదో వుంది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు. అప్పటికే వినాశనం మొదలయినట్లు ఆ అమ్మాయి కళ్ళు, చూపు ఎలాగో వున్నాయి.

"డాక్టర్! నాకేదో జరుగుతోంది" అన్నది హీనస్వరంతో. చెయ్యి పట్టుకుని :ఏమిటి?" అన్నాడు ధైర్యం చెబుతున్నట్లుగా.

కాని అప్పటికే షాక్ మొదలయింది. చెయ్యి చల్లగా తగిలింది. పల్స్ పలచబడింది. "నా గొంతు.. నా గొంతు.. బిగుసుకుపోతోంది డాక్టర్" ఆమె మాటలు ఎక్కడ్నుంచో వస్తున్నట్లు వస్తున్నాయి.

అతనికి అర్ధమయింది. ఎనాఫలెప్టిక్ షాక్ వచ్చింది. లైఫ్ సేవింగ్ డ్రగ్స్ కోసం గిరుక్కున వెనక్కి తిరగబోయాడు.

ఆమెకంత శక్తి ఎలా వచ్చిందో గట్టిగా చెయ్యి పట్టుకుని కదలనివ్వలేదు. "డాక్టర్ వెళ్ళకండి – నేను చచ్చిపోతాను" అంటోంది.

ఒక్క క్షణం ఆలశ్యం చెయ్యటానికి వీల్లేదు. ఆమెను విసురుగా విదిలించుకుని కాంపౌండర్ని పిలుస్తూ ఇంజక్షన్ రేక్ దగ్గరకు పరిగెత్తాడు. కొన్ని మందులున్నాయి కొన్ని లేవు. కాంపౌండర్ని దగ్గర్లో వున్న మందుల షాప్‌కు పరుగులెత్తించాడు.

డెకడ్రాన్ ఐ.వి, ఎవిల్ ప్రతి అయిదారు నిముషాలకూ అయిదారు మినిమ్స్ ఎడ్రినలిన్, గ్లూకోజ్ డ్రిప్, అందులో మళ్ళీ డెకడ్రాన్, ఎమినోఫిలిన్ పరిస్థితి చాలాసేపటివరకూ విషమంగానే ఉంది. ఆక్సిజన్ లేదు. ఆర్థికస్తోమత లేక కొనలేకపోయాడు.

పైగా ఆ అమ్మాయి ఒంటరిగా వచ్చింది. కబురు చేద్దామంటే చేతిలో మనుషులు లేనిమాట అలా వుంచి ఇల్లెక్కడో తెలీదు. ఒక దశలో టేబుల్ మీదే కొలాప్స్ అయిపోతుందేమో అనిపించింది. కాని కొంతసేపు చావు బ్రతుకుల మధ్య కొట్టుకులాడాక మెల్లగా త్రిప్పుకుంది. పల్స్ క్రమంగా మామూలు స్థితికి వచ్చింది. ఒంట్లోకి వేడి వచ్చింది. కళ్ళలోంచి పోయిన జీవకళ కాస్త కాస్త మళ్ళీ చోటుచేసుకుంది.

'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకున్నాడు. సాయంత్రందాకా కేసు టేబుల్ మీదే అట్టేపెట్టాడు. మొదట్నుంచీ కేసు అనుసరిస్తున్న సహజే ఆ అమ్మాయికి కాఫీ కలిపి ఇచ్చింది. స్థలం మార్చాలంటే బెడ్స్ లేవు.

సాయంత్రానికి పిల్ల ఎంతకూ ఇంటికి రాకపోయేసరికి ఆమె తలిదండ్రులు ఆదుర్దాపడుతూ వచ్చారు. వాళ్ళని చూసి అప్పటిదాకా బింకంగా వున్న ఆ అమ్మాయి బావురుమంది. "మా అమ్మాయికి పడని ఇంజక్షన్ ఎందుకు చేశారండీ?" అన్నాడు ఆమె తండ్రి, అదోలా చూసి.

ఆ చూపులో వాళ్ళమ్మాయిని రక్షించాడన్న కృతజ్ఞత కన్నా 'నిష్కారణంగా మా పిల్లని చంపేసేవాడివి కదటయ్య ' అన్న భావం కనబడుతోంది. ఆ చూపు గుండెలోకి లోతుగా ఎక్కడికో గుచ్చుకుపోయినట్లయింది. నోరు తెరిచి ఏదో అనాలనుకున్నాడు. కాని ప్రొద్దుటనుంచీ తిండీ తిప్పలూ లేకపోవటం వల్ల ఆవహించిన నీరసంతో నిగ్రహించుకుని ఊరుకున్నాడు.

ఆ సమయంలో ఏమి వాదించీ ప్రయోజనం లేదనిపించింది. వైద్యవృత్తిలో కొన్ని మందులుగానీ, ఇంజక్షన్లుగాని వాడితే వేయికో లక్షకో ఒకరికి వికటించే అవకాశముంది కాని ఆయా సందర్భాన్నిబట్టి ఆ మందులుగాని, ఇంజక్షన్లుగాని వాడక తప్పదు. ఆ రిస్క్ తప్పనిసరి.

అలాగే ఇంకొసారి ఇంకో సంఘటన జరిగింది. ఒక ఆఫీసరుగారొచ్చారు ఆ ఊరివాడు కాదు. ఏదో పనిమీద అక్కడికి వచ్చాడు. ఆయనకు ఎలర్జీ ఉంది. ఏ మాత్రం వాతావరణం మారినా, ఆహారంలో మార్పు వచ్చినా వళ్ళంతా దద్దుర్లు, దురదలు వస్తాయి. వళ్ళంతా ఇంతలావు  పొంగిపోతుంది. ఆయన పరిస్థితి చూసి బెట్‌నిసాల్ ఐ.వి చేశాడు. ఇంకా నీడిల్ పూర్తిగా తీశాడో లేదో ఆయన కళ్ళు రక్తం రాలుస్తున్నట్లు ఎర్రబడిపోయాయి.

"డాక్టర్! అమ్మో మంటలు, మంటలు. ఒళ్ళంతా నిప్పులా అయిపోయింది" అంటున్నాడు. నరేష్ చాలా తొందరగా అర్థం చేసుకున్నాడు. ఆయన్ని టేబుల్ మీద పడుకోబెట్టి గబగబ బి.పి.చూశాడు. రెండొందలు దాటిపోయింది సిస్టొలిక్. ఇంకా పెరిగిపోతోంది.

"మీకు హై బి.పి. ఉందా?" అనడిగాడు ఆ స్థితిలో కూడా ఆయన తెలివి తెచ్చుకుని లేదన్నట్లు తల ఊపాడు. తర్వాత స్మారకం కోల్పోయాడు. టాకీకార్డియా వచ్చి గుండె కొన్ని వందలసార్లు కొట్టుకుంటున్నది. పల్స్ లెక్కపెట్టటానికి వీల్లేనంత తొందరగా పరిగెడుతోంది. ఏం జరిగి వుంటుంది .బెట్‌నిసాల్ లైఫ్ సేవింగ్ డ్రగ్. కార్డికోస్టిరాయిడ్. ఏదయినా మందులు పడక రియాక్షన్ వచ్చినా, ఎనఫలెప్టిక్ షాక్ వచ్చినా వాడే డ్రగ్. అలాంటిది అది వాడితేనే కాంప్లికేషన్ వచ్చిందంటే విరుగుడుగా ఏం వాడాలి? ఏ ఎడ్రినలినో ఇస్తే గుండె వేగం, బ్లడ్‌ప్రెషర్ పెరిగిపోయినట్లుగా మారిపోయినట్లుగా, ఉగ్రంగా, సీరియస్‌గా వుంది ఆ రోగి స్థితి. ఏ నిమిషంలోనైనా మరణించేటట్లున్నాడు.

నరేష్‌కి చేతులు వణుకుతున్నాయి. ఏ మందు ఇవ్వటానికీ భయంగా వుంది. చివరకు విధికి భారం వదిలేసి కన్సర్వేటివ్‌లైన్స్ మీద ట్రీట్‌మెంట్ ఇచ్చాడు. నిమిషాలు లెక్కబెడుతూ కూర్చున్నాడు. అతని అదృష్టం బాగుంది. గంటా గంటన్నరలో పేషెంటు క్రమంగా కోలుకున్నాడు. షాక్‌నుంచి మెల్లగా రికవరయ్యాడు. మరి కాసేపట్లో మామూలు స్థితికి వచ్చేశాడు. తనను బ్రతికించినందుకు డాక్టరుకు కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు.

ఈ రెండు సంఘటనలు జరిగాక అతను మానసికంగా చాలా కృంగిపోయాడు. అందులో మొదటి సంఘటన తాలూకు అమ్మాయి తలిదండ్రులు అతనికి మందులకోసం అయిన ఖర్చులు వందరూపాయలదాకా ఇవ్వకుండా పోవటమేగాకుండా కావలసినంత దుష్ప్రచారం కూడా చేశారు. డాక్టరుగారు మనుషుల ప్రాణాలు తీసే యింజక్షన్లు ఏవేవో చేస్తున్నాడని ఆ వాడకట్టులో బాగా చెప్పుకున్నారు. అసలే ప్రాక్టీస్ మొదట్లో అంతంతమాత్రంగా వుంది. ఈ ప్రచారం జరిగాక జనం రావడం యింకా తగ్గారు.

"నేను ప్రాక్టీస్ చెయ్యను" అనాడు ఆ రాత్రి సహజ ఒళ్ళో తలపెట్టుకు పడుకుని.

"ఏం?"

"మనుషుల్ని చంపేస్తానేమోనని భయంగా వుంది."

“వాళ్ళెవరూ ఆవలేదుగా?”

“ఒకవేళ చచ్చిపోయివుంటే?”

“అయినా కూడా తప్పులేదు. మీ కర్తవ్యం మీరు సవ్యంగా నిర్వర్తించినపుడు పరిణామం చెడుగా వున్నా ఫరవాలేదు. సీరియస్ కేసు అయినప్పుడు, దాన్ని తగ్గించగల శక్తి అంతకన్నా లేనప్పుడు మనం దుఃఖపడి ప్రయోజనం లేదు. వైద్యంలో ఈ మరణాలు తప్పనిసరి.”

“అయినా వాటి ప్రభావం మనమీద వుంటుంది కదా — బాధపడకుండా వుండలేం కదా”

“వైద్య వృత్తిలో చిత్తశుద్ధితో  నిజాయితీగా వుండటమే ముఖ్యంకాని మరీ సెన్సిటివ్‌గా ఉండకూడదు. అలా వుండడం వల్ల మానసికంగా మనం దెబ్బ తినటమేకాక ఇతర పేషెంట్లని కూడా సరిగ్గా ట్రీట్ చెయ్యలేం.”

“మరికొన్ని పరాజయాలవల్ల పేషెంట్లు రావటం తగ్గించేస్తే?”

“ఏమి తగ్గరు. ఈ తగ్గటమన్నది తాత్కాలికం. మనలో నిజాయితీవుంటే వెతుక్కుంటూ వాళ్ళే వస్తారు.”

“మరి కొంతమంది డాక్టర్లు ఎంతకాలం పనిచేసినా ప్రాక్టీసు లేకుండా వుండిపోతారెందుకని?”

“వాళ్ళలో శ్రద్ధ, తెలివితేటలు పేషెంట్లని ఆకర్షించే శక్తి తక్కువున్నాయన్నమాట. డాక్టరు తన మేధస్సుతో, మంచితనంతో, లౌక్యంతో తనదంటూ ఓ యిమేజ్ ఏర్పరచుకోవాలి. అప్పుడే జీవితంలో సక్సెస్ అవుతాడు.”

ఆమె చేతిని పట్టుకుని తన గుండె మీద వుంచుకుని వ్రేళ్ళు సవరిస్తూ అన్నాడు. “మరి నీకిన్ని విషయాలు తెలుసుకదా నాకు అసిస్టెంట్ గా వుండి సహాయం ఏస్తూ వుండవచ్చు కదా!”

“నాకలాంటి కోరిక కన్నా మీ సాధకబాధకాల్ని అర్థం చేసుకునే గ్రుహిణిగా ఉండి, మిమ్మల్ని ఓ ఉత్తమమైన డాక్టరుగా రూపొందించటానికి యిన్స్పిరేషన్ గా వుండాలన్న కోరికే బలీయంగా ఉంది. హాస్పటల్ లో మీతోపాటూ ఉండిపోతే యింట్లో మీరు రిలాక్స్  అవలేరు. ఇల్లూ, హాస్పటల్ ఒకటిగానే కనిపిస్తుంది. అలసిపోయి, నలిగిపోయి వచ్చిన డాక్టరుకు ఇంట్లో రిలీఫ్‌గా ఉండాలి. లేకపోతే ఆ రొటీన్ మరీ యాంత్రికంగా తయారవుతుంది.”

“నీకీ విషయాలన్నీ ఎలా తెలుసు?”

“తెలీదు. తెలుసుకుంటున్నాను.”

రెండు చేతులూ జాచి ఆమె ముఖాన్ని తన ముఖానికి దగ్గరగా లాక్కున్నాడు.

“డాక్టర్ కి ప్రేమించటం తెలుస్తుందా ?” అన్నాడు మెల్లగా.

“తెలుస్తుంది.”

“ఎలా?”

“ఇలా.”

“ఎలా?”

“ఇదిగో –యిలా.”

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS